క్లుప్తంగా

పేదలకు అన్నదానం

నెల్లూరు(బృందావనం): జెడ్పీ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో శ్రీసత్యసాయి అక్షయ సేవా ట్రస్ట్ ద్వారా జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో రోగుల సహాయకులకు గురువారం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో యు.చెంచయ్య, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

➡ మదీనా వాచ్ గ్రూప్ చైర్మన్ షేక్ ఇంతియాజ్ పుట్టినరోజు సందర్భంగా వెయ్యి మందికి అన్నదానం చేశారు.

విద్యార్థినుల ప్రతిభ



నెల్లూరు(అర్బన్): నగరంలోని నారాయణ నర్సింగ్ కళాశాలలో ఎమ్మెస్సీ నర్సింగ్ విద్యార్థినులు షాలు మేరీషాజీ, కె.మౌనిక ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయ స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి ప్రొఫెసర్ చదలవాడ శ్రీలక్ష్మి మెమోరియల్ గోల్డ్‌మెడల్‌ను సాధించారు. రెండు రోజుల క్రితం విజయవాడలో విశ్వవిద్యాలయ 28వ స్నాతకోత్సవం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, నేషనల్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్ సీఈఓ డాక్టర్ ఓపీ యాదవ్ చేతుల మీదుగా వారు గోల్డ్ మెడల్స్ అందుకున్నారు. విద్యార్థినులను గురువారం నారాయణ ఆస్పత్రిలో యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది.

బొబ్బలకు 41ఏ నోటీసు

నెల్లూరు(క్రైమ్): స్థల వివాదం కేసులో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు బొబ్బల శ్రీనివాస్ యాదవ్‌కు గురువారం చిన్నబజారు పోలీసులు 41ఎ నోటీసు అందజేశారు. తాము పిలిచిన సమయంలో విచారణకు హాజరుకావాలని అందులో పేర్కొన్నారు.

వృద్ధురాలి మెడలో సరుడు చోరీ

నెల్లూరు(క్రైమ్): వృద్ధురాలి మెడలోని బంగారు సరుడును దుండగులు చోరీ చేశారు. పోలీసుల కథనం మేరకు.. పద్మ, రామకృష్ణ దంపతులు ప్రశాంతినగర్‌లో నివాసం ఉంటున్నారు. గురువారం పోలేరమ్మ జాతరకు వెళ్లేందుకు పద్మ ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చింది. రద్దీగా ఉండగా బస్సు ఎక్కే క్రమంలో ఆమె మెడలోని రెండున్నర సవర్ల బంగారు సరుడును గుర్తుతెలియని దుండగులు కత్తిరించుకెళ్లాడు. బాధితురాలు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రేణిగుంట చేరుకున్న పర్యాటకులు

రేణిగుంట: నేపాల్‌లో చిక్కుకున్న పర్యాటకులు ప్రత్యేక విమానంలో సురక్షితంగా గురువారం రాత్రి రేణిగుంట విమానాశ్రయానికి చేరారు. వీరిలో నెల్లూరుకు చెందిన ఐదుగురున్నట్లు అధికారులు తెలిపారు.

ఇలా ఉంటే రాకపోకలు ఎలా?

- దెబ్బతిన్న ఫ్లై ఓవర్
- ఓవైపు వాహనాలు గుల్ల, మరోవైపు ఒళ్లు హూనం
- ప్రమాదాలు చోటుచేసుకుంటున్న వైనం

నెల్లూరు సిటీ: నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఉన్న ఫ్లై ఓవర్‌పై వాహనాలు ఎక్కితే అంతే సంగతి. అక్కడక్కడా దెబ్బతినడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫ్లై ఓవర్లు లేదా బ్రిడ్జి నిర్మాణాల్లో బ్లాక్ రబ్బర్లు (బ్రిడ్జి బేరింగ్స్)ను వినియోగిస్తుంటారు. ఇవి దెబ్బతిన్నాయి.

మినీబైపాస్‌రోడ్డుపై రైల్వేస్టేషన్ నుంచి సాయిబాబా మందిరం వరకు ఫ్లై ఓవర్ ఉంది. ఆత్మకూరు, కోవూరు తదితర ప్రాంతాల వైపు నుంచి వచ్చే బస్సులు, మోటార్‌బైక్‌లు, కార్లు, ఆటోలు దీనిపై అధికంగా ప్రయాణిస్తుంటాయి. విజయమహల్ గేటు, ముత్తుకూరు గేటు సెంటర్, హరనాథపురం, పొగతోట, అన్నమయ్య సర్కిల్, అయ్యప్ప గుడి, ఇతర చోట్లకు వెళ్లేందుకు ఇది చాలా అనువుగా ఉంటుంది. అయితే గుంతల వల్ల ప్రయాణికులు భయాందోళకు గురవుతున్నారు.



ఆత్మకూరు బస్టాండ్ వద్ద దెబ్బతిన్న ఫ్లై ఓవర్

బ్లాక్ రబ్బర్లు కొన్నిచోట్ల ఊడిపోయాయి. మరికొన్నిచోట్ల పెచ్చులు లేచిపోయి శ్లాబ్ కమ్ములు దర్శనమిస్తున్నాయి. దీంతో రాకపోకలు సాగించే వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఫ్లై ఓవర్‌పై గుంతల్ని తప్పించబోయి కొందరు ప్రమాదాల బారిన పడిన సందర్భాలున్నాయి.



దెబ్బతిన్న ప్రాంతం

మరమ్మతులు చేయించాలి



నేను రోజూ ఆత్మకూరు బస్టాండ్ ఫ్లై ఓవర్‌పై రాకపోకలు సాగిస్తుంటాను. అయితే బ్లాక్ రబ్బర్లు కొన్నిచోట్ల ఊడిపోవడంతో వాహనాలు గుంతలో పడినట్లుగా ఉంటోంది. బండ్లు రిపేర్లకు గురవుతున్నాయి. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– రవిప్రవీణ్, స్టోన్‌హౌస్‌పేట

ప్రమాదాలకు అవకాశం



ట్రాఫిక్ సమస్య లేకుండా వాహన రాకపోకల కోసం ఫ్లై ఓవర్లను నిర్మించారు. ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఉన్న ఫ్లై ఓవర్‌పై గుంతలు ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రమాదాలు జరిగే అవకాశముంది.

– మనోజ్, తడికలబజార్ సెంటర్

అటవీ సంపద రక్షణలో ఉద్యోగుల పాత్ర భేష్

- ఘనంగా జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినం

నెల్లూరు(అర్బన్): అటవీ సంపద రక్షణలో ఉద్యోగుల పాత్ర భేష్ అని డీఎఫ్ఓ జిల్లా అటవీ శాఖాధికారి మహబూబ్‌బాషా తెలిపారు. గురువారం నెల్లూరు వేదాయపాళెంలోని ఫారెస్ట్ కార్యాలయంలో జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినం నిర్వహించారు. ఈ సందర్భంగా స్మగ్లర్లు, సంఘ విద్రోహుల వల్ల ప్రాణాలు కోల్పోయిన అటవీ శాఖ అధికారులకు, ఉద్యోగులకు ఘనంగా నివాళులర్పించారు. వారి త్యాగాన్ని గుర్తు తెచ్చుకున్నారు. అనంతరం డీఎఫ్ఓ మాట్లాడుతూ అడవులను కాపాడితేనే సకాలంలో వర్షాలు వస్తాయన్నారు. ఎర్రచందనం లాంటి ఖరీదైన జాతీయ సందపను కాపాడుకోవాలన్నారు. ఈ క్రమంలో అటవీ ఉద్యోగులు ఎన్నో ఒత్తిళ్లతో విధులు నిర్వర్తిస్తూ అటవీ సంపదను కాపాడుతున్నారన్నారు. కార్యక్రమంలో నెల్లూరు రేంజర్ మాల్యాద్రి, పలువురు రేంజర్లు, డిప్యూటీ రేంజర్లు పాల్గొన్నారు.



నివాళులర్పించిన డీఎఫ్ఓ తదితరులు

దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో 2025 – 26 సంవత్సరానికి గానూ రెండేళ్ల అలైడ్ హెల్త్ కేర్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపల్ డాక్టర్ రాజేశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లోకల్ అభ్యర్థులకు 85 శాతం, నాన్ లోకల్ అభ్యర్థులకు 15శాతం సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల వారు పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 27వ తేదీ లోపు పనిదినాలల్లో మెడికల్ కళాశాలలో అందజేయాలని కోరారు. దరఖాస్తు రుసుము రూ.100 చెల్లించాలన్నారు. కోర్సులు, దరఖాస్తుల వివరాలకు ఎస్పీఎస్‌నెల్లూరు.ఏపీ.జీఓవీ.ఇన్/నోటీసు/రిక్రూట్‌మెంట్ అనే వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కలెక్టర్ చర్యలు

నెల్లూరు(అర్బన్): జిల్లా కలెక్టర్‌గా ఒ.ఆనంద్ ప్రజా సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధితో పనిచేశారని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీఆర్ఎస్ఏ) జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ సమర్థ విధి నిర్వహణ, ప్రజా సమస్యలపై చూపిన శ్రద్ధ, రెవెన్యూ యంత్రాంగంతో కలిసి సమన్వయంగా పనిచేసిన తీరును ఏపీఆర్ఎస్ఏ గుర్తుంచుకుంటుందన్నారు. జిల్లా ప్రజలకు ఆయన విశిష్ట సేవలందించారని కొనియాడారు. అలాంటి కలెక్టర్ బదిలీపై వెళ్తున్న నేపథ్యంలో ఆయన మరింత ఉన్నతమైన పదవులు అలంకరించాలని కోరుకుంటున్నట్లు తెలియజేశారు.

ఏం జరిగిందో..

- ఇంట్లో పెయింటర్ మృతి

నెల్లూరు(క్రైమ్): మద్యం మత్తులో ఊపిరాడకో?, ఇతర కారణమో స్పష్టంగా తెలియదు గానీ పెయింటర్ తన ఇంట్లో మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఉమ్మారెడ్డిగుంటలో మధుసూదన్ (46), కవిత దంపతులు ఉంటున్నారు. వారి పెద్దకుమారుడు మేనమామ వద్ద ఉంటూ చదువుకుంటున్నాడు. చిన్న కుమారుడు తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు. మధుసూదన్ పెయింట్ పనులు చేస్తున్నాడు. అతను మద్యానికి బానిసయ్యాడు. సంపాదించిన మొత్తాన్ని దానికే వెచ్చించసాగాడు. కుటుంబ పోషణను పట్టించుకోవడం మానేశాడు. దీంతో దంపతుల నడుమ విభేదాలు చోటుచేసుకున్నాయి. కవిత అనారోగ్యంతో నెలరోజుల క్రితం చిన్నకుమారుడితో కలిసి సైదాపురం మండలం కుట్టుబడిపల్లిలోని తన పుట్టింటికి వెళ్లింది. అప్పటి నుంచి మధుసూదన్ ఒక్కడే ఉంటున్నాడు. బుధవారం రాత్రి అతడిని కలిసేందుకు స్నేహితుడు నాగేంద్రబాబు వెళ్లాడు. లోపల గడియపెట్టి ఉండటం, దుర్వాసన వస్తుండటంతో విషయాన్ని బాధిత అన్నదమ్ములు, స్థానికులకు తెలియజేశాడు. అందరూ కలిసి తలుపులు పగలగొట్టి చూడగా మధుసూదన్ మంచంపై మృతిచెంది ఉన్నాడు. దీంతో వారు జరిగిన విషయాన్ని కవితకు చెప్పారు. ఆమె గురువారం తెల్లవారుజామున నెల్లూరుకు చేరుకుని భర్త మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమైంది. వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

పెన్నానదిలో మృతదేహం

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు తిక్కనపార్కు సమీప పెన్నానదిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గురువారం స్థానికులు గుర్తించి సంతపేట పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహకారంతో మృతదేహాన్ని వెలికితీశారు. మృతదేహం కుళ్లి దుర్వాసన వెదజల్లుతోంది. మృతుడి వయసు 40 నుంచి 45 ఏళ్లలోపు ఉండొచ్చని భావిస్తున్నారు. స్విమ్మింగ్ కళ్లజోడు ధరించి ఉన్నాడు. కుడిచేతిపై ఎం.చెంచమ్మ, ఎం.శ్రీనివాసులు, ఎం.నాగమ్మ, ఎం.మీరమ్మ, ఎం.శివ, ఎం.మల్లి పేర్లు, చేతి వెనుకవైపు ఢమరుకం, పాము గుర్తు పచ్చబొట్లున్నాయి. చనిపోయి రెండు, మూడురోజులై ఉండొచ్చని భావిస్తున్నారు. ఎస్సై బాలకృష్ణ మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతిచెందాడా?, మరే ఇతర కారణం ఉందా? అనే వివరాలు తెలియరావాల్సి ఉంది. వివరాలు తెలిసిన వారు 94407 00097, 94407 96307 ఫోన్ నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

వేవేల దండాలు తల్లీ.. పోలేరమ్మా

- జైపోలేరు.. జైజై పోలేరంటూ మార్మోగిన వెంకటగిరి
- జన జాతరకు లక్షలాది మంది రాక
- నిబంధనలకు స్వస్తి.. ఏరులై పారిన మద్యం
- కూటమి నేతల కోసం ప్రత్యేక క్యూలైన్
- ముగిసిన పోలేరమ్మ జాతర

పోలేరమ్మ జాతర ముగిసింది. అయితే ఈ ఏడాది జాతర సంప్రదాయాలకు కూటమి నేతలు స్వస్తి పలికారు. అంతటా వారి పెత్తనమే ఎక్కువగా కనిపించింది. జాతర వేళ రెండురోజులపాటు పూర్తిగా మద్యం అమ్మకాలను నిలిపివేయడం మొదటి నుంచి వస్తున్న ఆనవాయితీ. అయితే 48 గంటల పాటు కాకుండా కేవలం 24 గంటలు మాత్రమే నిషేధించారు. రాజాలకు కనీస మర్యాదలు కూడా ఇవ్వకుండా కూటమి నేతలు అడుగడుగునా అడ్డు తగిలారు. మరోవైపు తాగునీటి కోసం భక్తులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.



భక్తజనసందోహం మధ్య పోలేరమ్మ నగరోత్సవం

వెంకటగిరి(సైదాపురం): కోరిన కోర్కెలు తీర్చే తల్లీ.. పోలేరమ్మా.. కాపాడగరావమ్మా.. అంటూ భక్తజనం పోలేరమ్మ ఎదుట ప్రణమిల్లారు. జాతర సందర్భంగా వెంకటగిరి పురవీధులన్నీ స్వర్ణకాంతులతో దేదీప్యమానంగా కాంతులీనాయి. అమ్మవారి ప్రతిరూపాన్ని తనివితీరా దర్శించుకున్న భక్తులు పులకించారు. పట్టణమంతా జై పోలేరా.. జైజై పోలేరా తల్లీ అంటూ మార్మోగింది. జిల్లా నలుమూలలే కాకుండా దేశవిదేశాల నుంచి కూడా పోలేరమ్మ జాతరకు విచ్చేయడంతో దారులన్నీ వెంకటగిరివైపే మళ్లాయి. దీంతో ఎక్కడ చూసినా జనమే దర్శనమిచ్చారు.

ఆనందోత్సాహాల మధ్య..

నగరోత్సవం ప్రారంభం కాగా భక్తులు పెద్దఎత్తున వీక్షించారు. బుధవారం అర్ధరాత్రి అమ్మవారి మెట్టునిల్లు అయిన జీనుగులవారి వీధి నుంచి వేకువజామున నాలుగు గంటలకు అమ్మవారిని ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయం వద్ద ప్రత్యేకంగా నిర్మించిన మండపంలో అధిష్టించారు. గురువారం తెల్లవారుజాము నుంచే భక్తులను దర్శనానికి అనుమతించారు. అయితే నామమాత్రంగా ఒక గంట పాటు వాటర్, మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. ఉచిత దర్శనం, రూ.100, రూ.300 టికెట్లను కొనుగోలు చేసిన భక్తుల కోసం పాతబస్టాండ్ మీదుగా కొత్తగా క్యూలైన్‌ను పొడిగించారు. అమ్మవారి సాంగెం పోలీసు బందోబస్తు నడుమ రాజా భవనం నుంచి అమ్మవారి ఆలయం వద్ద తీసుకురావాల్సి ఉండగా అవేవీ లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ ఏడాది కూటమి నేతల కనుసన్నల్లో జాతర జరిగింది. గతంలో ఉన్న వీఐపీ క్యూలైన్ పూర్తిగా ఎత్తేసి ప్రోటోకాల్ ఉన్నవారికి మాత్రమే ప్రత్యేక దర్శనమని ప్రకటించారు. కానీ అదంతా కేవలం ప్రకటనలకే పరిమితమైంది.

సారె సమర్పణ

వెంకటగిరి రాజా కుటుంబీకుల సర్వజ్ఞకుమార కృష్ణ యాచేంద్రతోపాటు పలువురు అమ్మవారికి సంప్రదాయబద్ధంగా సారెను సమర్పించారు. ఆలయ మహాద్వారం నుంచి పసుపు కుంకుమ, గాజులు, పట్టువస్త్రాలతో కూడిన సారెను అందించారు. అంతకుముందు నెల్లూరు జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, వైఎస్సార్‌సీపీ నేత బొలిగర్ల మస్తాన్ యాదవ్, నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు.

దున్నపోతు బలితో..

జాతర సంప్రదాయ ప్రకారం అమ్మవారికి దున్నపోతు బలి కార్యక్రమం జరిగింది. అమ్మవారి నిమజ్జనం పూర్తయ్యే వరకు గండదీపం ఆరిపోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. బలి పూర్తి కాగానే గ్రామ పొలిమేరల్లో నాలుగుదిక్కులా పొలి చల్లారు.

పట్టువస్త్రాల సమర్పణ

జాతర సందర్భంగా దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అమ్మవారికి సంప్రదాయబద్ధంగా మేళతాళలతో పట్టువస్త్రాలను సమర్పించారు.



ప్రత్యేకాలంకరణలో పోలేరమ్మ



ఆలయం వద్ద నెల్లూరు జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



బలి కత్తికి పూజ చేసి తీసుకెళ్తూ..



మొక్కులు చెల్లించేందుకు వెళ్తూ..

సమస్యల్ని పరిష్కరించాలని డిమాండ్

నెల్లూరు(టౌన్): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని బీటీఏ జిల్లా అధ్యక్షుడు మణిసుబ్బు కోరారు. నెల్లూరు నగరంతోపాటు రూరల్ పరిధిలోని పలు ప్రాంతాల్లోని స్కూళ్లలో గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ యాప్‌ల భారాన్ని తొలగించాలన్నారు. జీఓ నంబర్ 77ను వెంటనే రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో బీటీఏ నాయకులు రాజశేఖర్, రవి, హరి, చెన్నకేశవులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదులో బీటీఏ నాయకులు

స్కూల్‌కు జాతీయ స్థాయి అవార్డు

నెల్లూరు సిటీ: 2024 – 25 విద్యా సంవత్సరానికి జాతీయ స్థాయిలో ది స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డును సద్గురు సిల్వర్ ఓక్స్ స్కూల్ సాధించింది. బుధవారం న్యూఢిల్లీలో అవార్డు అందుకున్నట్లు స్కూల్ డైరెక్టర్లు షణ్ముఖ ఆచారి, వెంకటాద్రి నాయుడు గురువారం వెల్లడించారు. వారు మాట్లాడుతూ సెంటర్ ఫర్ స్కూల్ ర్యాంకింగ్స్, బ్రెయిన్ ఫీడ్ ఇండియా సంస్థలు సంయుక్తంగా ప్రతి ఏడాది అవార్డులు ఇస్తాయన్నారు. ఈ ఏడాది ఏపీ నుంచి తమ స్కూల్ ఎంపికవడం సంతోషంగా ఉందన్నారు.



అవార్డు అందుకుంటున్న స్కూల్ డైరెక్టర్లు

జీవనోపాధి కల్పించేందుకు కృషి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నిరుపేద యానాది కుటుంబాలకు జీవనోపాధి కల్పించి వారి అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు డీసీఓ గుర్రప్ప తెలిపారు. కావలి మండలం కొత్తపల్లి గ్రామంలో వెన్నెలకంటి రాఘవయ్య పరస్పర సహాయక సహకార పొదుపు పరపతి సంఘాన్ని ఏర్పాటు చేశారు. సభ్యులకు గురువారం నగరంలోని డీసీఓ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ సహకార సంవత్సరం పురస్కరించుకుని నూతన సంఘాల ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్యాలయ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఉమామహేశ్వరి, సీనియర్ ఇన్‌స్పెక్టర్లు విజయలక్ష్మి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న డీసీఓ

కార్పొరేషన్ కమిషనర్ పర్యటన

నెల్లూరు(బారకాసు): నగరంలోని ఫత్తేఖాన్‌పేట రామాలయం ప్రాంతంలో రహదారి ఆక్రమణపై ఫిర్యాదు రాగా గురువారం నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ వెళ్లి పరిశీలించారు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు సమస్యను క్షుణ్ణంగా విచారించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సిటీ ప్లానర్ హిమబిందు, సచివాలయ వార్డు ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

➡ తడికలబజార్ సెంటర్, అన్న క్యాంటీన్ పక్కన బాలభవన్ ప్రాంగణంలో నూతన నిర్మిస్తున్న పార్కు పనులను కమిషనర్ పరిశీలించారు. ఆయన వెంట ఈఈ అనిల్‌కుమార్, ఇంజినీరింగ్ సిబ్బంది ఉన్నారు.

➡ జాకీర్‌హుస్సేన్ నగర్ ప్రాంతంలో ఓవర్‌హెడ్ రిజర్వాయర్‌కు నూతనంగా నిర్మిస్తున్న ప్రహరీ పనులను కమిషనర్ పరిశీలించారు.

➡ స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ బజారు పనులను నందన్ పరిశీలించారు. నిర్దేశించిన సమయంలో ఆ పనులను పూర్తి చేయాలన్నారు.



పరిశీలిస్తున్న కమిషనర్ నందన్

167 మందికి కోర్టు ద్వారా నోటీసులు

- ఎస్ఈ రామ్మోహన్‌రావు

నెల్లూరు(బారకాసు): 'కుళాయి పన్నులు బకాయి లున్న 167 మందికి కోర్టు ద్వారా నోటీసులు జారీ చేశాం. అందులో 30 మంది కార్యాలయానికి రూ.18 లక్షలు చెల్లించారు' అని సూపరింటెండెంట్ ఇంజినీర్ రామ్మోహన్‌రావు తెలిపారు. గురువారం ఎన్ఎంసీలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వారాంతపు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బకాయిలున్న వినియోగదారులకు డిమాండ్ నోటీసులు జారీ చేయాలన్నారు. ఈనెల 13వ తేదీన శనివారం కోర్టు ఆవరణలో జరిగే నేషనల్ లోక్ అదాలత్‌కు వారు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. హౌసింగ్‌పై డీఈలు, ఏఈలతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఈఈలు శేషగిరిరావు, రహంతుజానీ, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఈ

జొన్నవాడకు వెళ్లే ప్రధాన రహదారిపై ఇలా..



వాన తెచ్చిన కష్టం

నెల్లూరులో బుధవారం రాత్రి నుంచి కురిసిన వర్షం కారణంగా వివిధ ప్రాంతాల్లో రోడ్లు జలమయం అయ్యాయి. వాన నీటిలో చెత్త చేరడంతో పరిస్థితులు దారుణంగా మారాయి. రాకపోకలు సాగించేందుకు వాహనదారులు అవస్థలు పడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



పొట్టేపాళెం గ్రామం వద్ద..



ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయ సమీపంలో..

ఆరోపణలు చేయడం దారుణం

నెల్లూరు సిటీ: సాగరమాల ప్రాజెక్ట్‌లో భాగంగా రోడ్ల కోసం కంపెనీలు రూ.2.56 కోట్ల పన్ను చెల్లించి గ్రావెల్ తోలుకుంటే మేం దోచుకున్నామని ఆరోపిస్తున్నారని, ఇది దారుణమని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వెంకటాచలం మండలంలో రూ.కోట్ల విలువైన గ్రావెల్ కొట్టేస్తున్నామని పదేపదే ఆరోపణలు చేస్తున్నారన్నారు. అయితే సాగరమాల ప్రాజెక్ట్‌లో భాగంగా రహదారుల నిర్మాణం జరుగుతోందన్నారు. ఆయా కంపెనీలు తాము చేస్తున్న పనులకు గ్రావెల్ తోలుకుని మైనింగ్ సీనరేజ్‌తోపాటు జీఎస్టీ చెల్లిస్తున్నట్లు చెప్పారు.